సాక్షి
అనకాపల్లి

బుధవారం । 12 । జూలై । 2023



రాకపోకలు పునరుద్ధరణ 8లో

కేకే లైన్లో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కొండచరియలు విరిగిపడడంతో అంతరాయం కలిగిన విషయం తెలిసిందే.



అష్టదళ పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



ముగిసిన జిమెక్స్ విన్యాసాలు

జపాన్ ఇండియా మారీటైం విన్యాసాలు (జిమెక్స్) మంగళవారంతో ముగిశాయి. 8లో

న్యూస్‌రీల్

శాకంబరి అవతారంలో మోదకొండమ్మ



మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ మంగవారం శాకంబరి అవతారంలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడం సంప్రదాయం. ఈ అవతారంలో అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, భక్తుల విశ్వాసం. శాకంబరి రూపంలో అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ చీఫ్ కోచ్‌గా రమణ



అనకాపల్లిటౌన్: జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ చీఫ్ కోచ్‌గా ఎల్.వి.రమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అన్నిశాఖల క్రీడాకారుల సహకారంతో విధులు నిర్వహిస్తానన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆనంద లక్ష్మి విశాఖ డీఎస్‌వోగా బదిలీపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రమణను కోచ్‌లు ఎం.అచ్యుతరావు, పి.వి.నాగేశ్వరరావు, ఎన్‌వీఎస్ రమేష్, జి.రాంబాబు, కె.త్రిమూర్తులు, ఆఫీస్ ఇన్‌చార్జ్ వేణుగోపాలరావులు అభినందించారు.

ఉపాధి పథకంలో ఎస్సీ, ఎస్టీ డీ పట్టా భూముల అభివృద్ధి



ఎస్సీ, ఎస్టీ ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ సందీప్

కశింకోట: ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం మంజూరు చేసిన డి–ఫారం పట్టా భూములను ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పథక సంచాలకుడు (పీడీ) ఇ.సందీప్ తెలిపారు. మండలంలోని నూతలగుంటపాలెం, కశింకోట గ్రామాల్లో మంగళవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ ఉపాధి కూలీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట, నూతలగుంటపాలెం గ్రామాల్లో డీ పట్టా భూములున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధి కూలీలు మాట్లాడుతూ తమ భూముల్ని ఉపాధి పథకంలో అభివృద్ధి చేయాల్సిందిగా కోరారు. అక్కడే ఉన్న ఉపాధి అధికారులు, సిబ్బందికి ఈ మేరకు చర్యలు చేపట్టాలని పీడీ ఆదేశించారు. ఉపాధి పథకంలో చేపడుతున్న పనులకు ఎస్సీ, ఎస్టీ కూలీల హాజరు శాతం తక్కువగా ఉండటంపై ఆరా తీశారు. ఉపాధి పనులు కల్పిస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. పని కల్పిస్తున్నారని, అయితే ప్రత్యామ్నాయ పనులు ముగించుకుని ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు కూలీలు తెలిపారు. ఎంపీడీవో రవికుమార్, అదనపు పీడీ రోజారాణి, క్లస్టర్ ఏపీడీమణికుమార్, ఏపీవో శివ, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

భగ్గుమన్న వలంటీర్లు

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే వలంటీర్లపై పవన్ కల్యాణ్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడంపై జిల్లా వ్యాప్తంగా రెండో రోజూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఆడవాళ్ల అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు రోడ్డెక్కారు. పవన్ కల్యాణ్ చిత్రాలకు నిప్పంటించి దహనం చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ఆందోళనల్లో పాల్గొని వారికి మద్దతు పలికారు.



ఎస్.రాయవరం పాత జాతీయ రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న వలంటీర్లు



మాడుగుల బస్టాండ్‌లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

సాక్షి, అనకాపల్లి: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండో రోజు కూడా ప్రకంపనలు సృష్టించాయి. జిల్లావ్యాప్తంగా మంగళవారం నిరసనలు వెల్లువెత్తాయి. పవన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు రోడ్డెక్కారు. మాడుగుల టౌన్‌లో పాత బస్‌స్టాండ్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించిన వలంటీర్లు.. అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. చోడవరం టౌన్ కొత్తూరు జంక్షన్‌లో వలంటీర్లు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సచివాలయం నుంచి కొత్తూరు జంక్షన్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేశారు. రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో వలంటీర్లు ఆందోళన చేశారు. మునగపాక మండలంలో వలంటీర్లు ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను తగలబెట్టారు. ఎస్.రాయవరం మండలంలో 28 గ్రామాల వలంటీర్లు అడ్డురోడ్డు జంక్షన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మునగపాకలో వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా పవన్ ప్రవర్తించడం బాధాకరమన్నారు. వలంటీర్ల సేవలు నిరుపమానమన్నారు.

కొండంత అండ



మా బాబు రిశాంత్ బాబి వివేక్‌కు తలసేమియా వ్యాధి ఉంది. ఆపరేషన్ చేయాల్సి ఉందని డాక్టర్లు చెప్పారు. సీఎం జగనన్న నర్సీపట్నం వచ్చినపుడు మా బాబు వ్యాధి గురించి వివరించి సాయం చేయమని మొరపెట్టుకున్నా. వెంటనే వైద్యానికి రూ.21 లక్షలు మంజూరు చేశారు. రూ.10 వేలు పింఛను కూడా వస్తోంది. ఆపరేషన్ చేయిద్దామని హైదరాబాద్‌కు వచ్చాం. వలంటీరు లోవకృష్ణ 3 నెలలుగా పింఛను డబ్బులు ఇక్కడికే తెచ్చి ఇస్తున్నారు. వలంటీర్లే లేకపోతే చాలా ఇబ్బంది పడేవాళ్లం.

–పెదపూడి రత్నకుమారి, పేషెంట్ తల్లి, రాట్నాలపాలెం, కోటవురట్ల మండలం

దివ్యాంగురాలిని నిలబెట్టారు



నా కుమార్తె ఆడబాల ఉజ్వల పుట్టుకతోనే దివ్యాంగురాలు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోయింది. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో వలంటీర్ కె.కుమారికి సమస్యను వివరించాను. దాంతో ఆమె సదరం సర్టిఫికెట్ మంజూరయ్యేలా కృషి చేసింది. దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు పెట్టాను. వెంటనే మంజూరయింది. 1వ తేదీన వలంటీర్ కుమారి మా కుమార్తెకు రూ.3 వేలు పింఛన్ అందిస్తోంది.

–ఆడబాల సత్యవతి, పోతంశెట్టివారివీధి, అనకాపల్లి

కోవిడ్ కల్లోలం.. సేవలతో ఉపశమనం



ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్ రాజు (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: కరోనా విలయతాండవం చేస్తున్న వేళ.. అయిన వాళ్లే దూరమైన దుర్భర పరిస్థితుల్లో గ్రామ వలంటీర్లు మేమున్నామంటూ ప్రశంసనీయ సేవలందించారు. పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలంలోని రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల పరిధిలో పనిచేసిన 26 మంది వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలను ఆదుకున్నారు. ఈ మత్స్యకార గ్రామాల్లో జనాభా సంఖ్య సుమారు 10 వేలు. కుటుంబాలను పోషించుకునేందుకు నిత్యం 40 శాతం మంది పనుల కోసం వేరే ప్రాంతాల్లో ఉంటారు. ప్రతి కుటుంబంలో ఒకరు వలసకు వెళతారు. కరోనా మొదటి వేవ్‌లో లాక్‌డౌన్ విధించడంతో ప్రతి ఇంటిలో ఒకరిద్దరూ బయటే చిక్కుకుపోయారు. వారు రాకపోవడంతో వారి కుటుంబాలకు నిత్యావసర సరకుల నుంచి ఆహారం వరకూ వలంటీర్లే అందించేవారు. వలసకు వెళ్లిన సుమారు వెయ్యిమంది మొదటి వేవ్‌లో స్వగ్రామానికి తిరిగి వచ్చారు. వారందరినీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌లో ఉంచారు. వారికి మూడు పూటల వలంటీర్లే ఆహారం అందించేవారు. తమ జీతంలో సగం డబ్బులు వేసుకుని క్వారంటైన్‌లో ఉన్నవారికి ఆహారం అందించారు. ఒకసారి కరోనా అనుమానిత గర్భిణిని విశాఖపట్నం ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో వలంటీర్లే ఆమెను ఆటోలో తీసుకుని వెళ్లారు. ఈ క్రమంలో కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన వలంటీర్ చేపల రాజుకు కరోనా సోకింది. చావు వరకు వెళ్లి చివరకు కోలుకున్నాడు. వలంటీర్ల సేవలను ఇప్పటికీ గ్రామస్తులు కొనియాడుతూ ఉంటారు.

ఆపన్నహస్తం.. సేవలు అపురూపం



కరోనా కష్టకాలంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న ఉమ్మలాడ వలంటీర్ లక్ష్మీప్రసన్న

మునగపాక: మండలంలో ఉమ్మలాడ వలంటీర్‌గా పనిచేస్తున్న సూరిశెట్టి లక్ష్మీప్రసన్న తన నిరుపమాన సేవలతో ప్రజలకు ఆత్మబంధువుగా మారారు. గౌరవ వేతనాన్ని ప్రజల సంక్షేమం కోసం వెచ్చిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. కరోనా కష్టకాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండేందుకు తనకు వచ్చిన గౌరవ వేతనం నుంచి రూ.50 వేలు సమకూర్చి సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందజేశారు. గ్రామంలో కరోనా కట్టడి చేసేందుకు తరచూ శానిటైజేషన్ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు సౌకర్యవంతంగా ఉండేలా ఫ్యాను, చాపలు అందజేశారు. విద్యార్థులకు పుస్తకాలు, ఆస్పత్రులకు పరికరాలు, ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు.

ఆత్మబంధువులపై ఎందుకంత అక్కసు?

- కక్షగట్టిన పవన్, బాబు, రామోజీ
- ప్రజల్లో పట్టు తప్పుతున్నామన్న భీతి
- జనానికి వీరి సేవలను దూరం చేయాలన్న దుర్బుద్ధి
- నాడు బాబు, నేడు పవన్ అభ్యంతరకర వ్యాఖ్యలు
- నిప్పులు చెరుగుతున్న వలంటీర్లు

సాక్షి, విశాఖపట్నం: పేదలకు సంక్షేమ పథకాలు అందాలి. నిత్యం వారి బాగోగులు చూడటానికి, వారి అవసరాలు తీర్చడానికి ఓ వ్యవస్థ ఉండాలి. ప్రజల వద్దకు పాలన చేరువ కావాలి. అవినీతికి తావులేని సేవలు అందించాలి. ఇలాంటి ఆలోచనలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదినుంచి ఆవిర్భవించినదే గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థ. మూడేళ్ల నుంచి ఊరూ, వాడా నిస్వార్థ సేవలందిస్తూ జనానికి చేరువై అందరి ఆదరాభిమానాలు చూరగొంటున్న ఈ వలంటీర్లను చూసి చంద్రబాబు, పవన్ కల్యాణ్, రామోజీలకు కన్నుకుట్టినట్టుంది. ప్రజల్లో పట్టుతప్పుతున్నామని భీతిల్లుతున్నారు. అందుకే వీరిపై అదే పనిగా ఆక్రోశిస్తున్నారు. మొన్నటికి మొన్న 'మూటలు మోసే ఉద్యోగం.. ఇంట్లో మగవాళ్లు లేనప్పుడు వలంటీర్లు లోపలికి దూరుతారు' అంటూ చంద్రబాబు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు 'వలంటీర్లు ఒంటరి మహిళల సమాచారాన్ని సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారు' అంటూ వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ నిందించారు. వీరిద్దరూ ఇలా వీరిని నోటికొచ్చినట్టు మాట్లాడుతుంటే.. రామోజీ తన పచ్చ పత్రికలో వలంటీర్ల వ్యవస్థను కించపరుస్తూ తరచూ కథనాలు వండుతున్నారు. తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై వలంటీర్లు పెద్ద ఎత్తున మండిపడుతున్నారు. రెండు రోజులుగా రాష్ట్రంతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు చేరువగా..

వలంటీర్లు ప్రజలకు బంధువులయ్యారు. 50 ఇళ్లకో వలంటీరు చొప్పున నియామకంతో వారు నిత్యం వారితో మమేకమవుతున్నారు. వారి బాగోగులు అడిగి తెలుసుకుంటున్నారు. కష్టాల్లో పాలుపంచుకుంటూ వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మెలుగుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, వివిధ రకాల సర్టిఫికెట్ల మంజూరులో సాయపడుతూ, స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులతో సమన్వయం చేయడం, నెలనెలా ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ వంటి సేవలతో వీరు ప్రజలకు మరింతగా చేరువయ్యారు. పైగా మునుపటిలా లంచాలివ్వకుండా పనులు జరుగుతున్నాయి. కరోనా మహమ్మారి ఎందరినో కబళించినప్పుడు కూడా వీరు కుటుంబ సభ్యులకంటే మిన్నగా బాధితులకు ప్రాణాలకు తెగించి వైద్య సాయం అందించడంలో విశేష సేవలందించి ఎందరో ప్రాణాలను కాపాడగలిగారు. ఇలాంటి నిస్వార్థ సేవలతో వలంటీర్లు ప్రజల మన్ననలు చూరగొన్నారు.వలంటీర్ల వల్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తుందన్న అక్కసుతోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్, రామోజీలు పనిగట్టుకుని వీరిని టార్గెట్ చేస్తున్నారన్న వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తోంది.

డంపింగ్‌యార్డు తరలింపునకు యత్నాలు

- అనకాపల్లి శివారులో త్వరలో స్థలాల పరిశీలన
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



పెరుగుబజార్ రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అనకాపల్లి టౌన్: అనకాపల్లి జోన్ కార్యాలయం వద్ద ప్రస్తుతం ఉన్న డంపింగ్‌యార్డును త్వరలో తొలగించి, పట్టణానికి దూరంగా తరలించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ చెప్పారు. పట్టణంలో పెరుగుబజార్ జంక్షన్, నూకాంబిక రహదారిలో పూల్‌బాగ్‌రోడ్డు, కూరగాయల మార్కెట్, చింతావారివీధి తదితర ప్రాంతాల్లో 81, 83 వార్డుల కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య, జాజుల ప్రసన్నలక్ష్మిలతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి శివారులో వివిధ ప్రాంతాలను పరిశీలించి, డంపింగ్ యార్డును ఎక్కడికి మార్పు చేయాలో నిర్ణయిస్తామన్నారు. పెరుగుబజార్–గాంధీబొమ్మ జంక్షన్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం డంపింగ్‌యార్డులో చెత్త ఎంత ఉందో తెలుసుకున్నారు. తక్షణమే చెత్తను కాపులుప్పాడకు తరలించాలన్నారు. జీవీఎంసీ సుందరీకరణలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో అనకాపల్లి జోన్ ప్రథమ స్థానం సాధించేందుకు అధికారులు విశేష కృషి చేయాలని, నగర పౌరులను చైతన్యవంతులను చేయాలని ఆయన కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు మంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. నూకాంబిక అమ్మవారి ఆలయం నుంచి పూల్‌బాగ్ జంక్షన్ వరకూ ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువల నిర్మాణం, అమ్మవారి గుడి వెనక కాలనీకి రహదారి, కాలువలు, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, స్టేడియం ఫ్లోర్ మరమ్మతులు మొదలైన పనులు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. గవరపాలెం గౌరీపరమేశ్వరి పార్కు వద్ద పర్యవేక్షకుడిని త్వరలో నియమిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ వెంకటరమణ, 81, 83వ వార్డు ఇన్‌చార్జ్‌లు పీలా రాంబాబు, జాజుల రమేష్, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ పోయినా డోంట్ కేర్!



- ఎలక్ట్రిక్ పరికరం రూపొందించిన డైట్ విద్యార్థినులు

–8లో

నేడు తాండవ రైతులతో సమావేశం

సాక్షి ఎఫెక్ట్..



నాతవరం: తాండవ రిజర్వాయరు పరిధిలో ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్టు తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షార్ జేఈ శ్యామ్ తెలిపారు. తాండవ జలాశయ కాలువల మరమ్మతులు, గట్లు, గేట్ల పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులిచ్చినా.. అధికారులు పనులు చేపట్టకపోవడంపై ఈ నెల 10న ''అధికారుల నిర్లక్ష్య 'తాండవ'ం''శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్తపై ఇరిగేషన్ అధికారులు స్పందించారు. జేఈ శ్యామ్ మాట్లాడుతూ నాతవరం ఇరిగేషన్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి తాండవ ప్రాజెక్టులో నీటి నిల్వలపై ఆయకట్టు రైతులకు ప్రజాప్రతినిధులకు వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఖరీఫ్ పంట సాగుకు తాండవ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి విడుదలపై చర్చించనున్నట్టు తెలిపారు. తాండవ జలాశయ ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అభీష్టం మేరకు నీటి విడుదల తేదీలను ఖరారు చేస్తామన్నారు. ఈ సమావేశానికి తాండవ ప్రాజెక్టు పరిధిలోనున్న నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన ఆయకట్టుదారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

పశువుల్లో ప్రాణాంతకం బ్రూసెల్లోసిస్

- వ్యాధి నియంత్రణలో భాగంగా పెయ్యిలకు ఉచిత టీకాలు
- జిల్లాలో 31,870 పెయ్యిలకు మూడు విడతల టీకాలు
- ఈ నెల 20 లోగా శతశాతం టీకాలకు చర్యలు



మామిడిపల్లిలో దూడలకు టీకాలను వేస్తున్న పశువైద్యశాఖ అధికారి ప్రియాంక

దేవరాపల్లి: పాడి పశువుల ఆరోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. పశువులు అనారోగ్యం బారిన పడకుండా సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచింది. అన్ని పశు వైద్యశాలలతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో సైతం పశు వైద్య సేవలను అందిస్తూ పాడిరైతులకు కొండంత భరోసానిస్తోంది. ఈ క్రమంలోనే పాడి పశువులకు సోకే ప్రమాదకర బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకా కార్యక్రమానికి ఈ నెల 1న శ్రీకారం చుట్టింది.

వ్యాధి కారకాలు

బ్రూసిల్లా అబార్టస్ అనే బ్యాక్టీరియా వలన ఈ వ్యాధి సంక్రమిస్తుంది. దీన్ని బ్యాంగ్స్ వ్యాధి అని కూడా వ్యవహరిస్తారు. ఎక్కువగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందుల్లో ఈ వ్యాధి కనిపిస్తుంది. పాశ్చరైజ్ కాని(పచ్చి) పాలు, పశువుల మాంసం తినడం, వ్యాధి సంక్రమించిన జంతువుల నుంచి వచ్చే గాలి పీల్చడం, వాటి స్రావాల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పశువుల్లో కృత్రియ గర్భధారణ పద్ధతితో ఈ వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు.

వ్యాధి సోకిన పశువుల్లో లక్షణాలు

బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకిన పశువుల్లో గర్భకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. ఈ వ్యాధి సోకిన పశువులు ఎదకు రాకపోవడం, చూడి నిలవకపోవడం, నెలలు నిండకుండానే గర్భస్రావం జరగడం, నీరసమైన దూడ/పెయ్యలు జన్మించడం, పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం క్షీణించడం, కీళ్ల నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తాయి. గర్భస్రావ వ్యర్థాలు మనుషుల చేతికి తగిలితే వారికి సైతం ఈ వ్యాధి సంక్రమించే ప్రమాదం ఉంది. అందుకే ప్రస్తుత ప్రభుత్వం దీని నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టింది.

పెయ్యిలకు తొలి ప్రాధాన్యం

ఆడ దూడ(పెయ్య)లను సంరక్షించగలిగితే పశు సంపదను వృద్ధి చేయొచ్చు. అందుకే వాటి ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆవు, గేదె పెయ్యిలకు తొలి విడతలో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. జిల్లాలో 31,870 పెయ్యిలకు ఈ టీకా వేయాలని ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన టీకా కార్యక్రమం 20 వరకు కొనసాగుతుంది. జిల్లాలోని అన్ని పశువైద్య శాలలతో పాటు, ఆర్బీకేల్లో కూడా ఈ టీకాలను అందుబాటులో ఉంచారు. 4 నుంచి 8 నెలలు వయసున్న ఆడ దూడలకు మూడు విడతల్లో ఈ టీకాలను వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. మొదటి విడత ఈ నెల 1 నుంచి 20 వరకు, రెండో విడత అక్టోబర్ 1 నుంచి 20 వరకు, మూడో విడత వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు.

టీకా తప్పనిసరి



పాడిరైతులు తమ వద్ద నున్న ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాను తప్పనిసరిగా వేయించాలి. సమీపంలోని పశు వైద్యశాలలు, ఆర్బీకేల్లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆడ దూడలకు మూడు విడతల్లో ఈ టీకాలను వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొదటి విడత ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతోంది.

– డా.ప్రసాదరావు, జిల్లా పశువైద్యశాఖ అధికారి, అనకాపల్లి

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- సంఘటన స్థలంలో ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో మృతి చెందిన సతీష్

పాడేరు రూరల్ : పాడేరు–చోడవరం ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మ తల్లి పాదాల రెండో మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సతీష్, విక్రమ్ అనే ఇద్దరు యువకులు వ్యక్తిగత పనుల నిమిత్తం పాడేరు వచ్చారు. పనులు ముగించుకొని మంగళవారం మధ్యాహ్నం తిరిగి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా మోదకొండమ్మ అమ్మవారి పాదాలు రెండో మలుపు వద్ద చోడవరం నుంచి పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలు పాలైన విక్రమ్‌ను స్థానికులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

పాపికొండలు పర్యాటకం పునఃప్రారంభం



పర్యాటకులతో బయలుదేరిన హరితా బోట్

వీఆర్‌పురం: తుపాను కారణంగా గత నెల 20వ తేదీన నిలిచిపోయిన పాపికొండలు పర్యాటకం వాతావరణం అనుకూలంగా ఉన్నందున మంగళవారం పునఃప్రారంభించేందుకు సబ్‌కలెక్టర్ సూరజ్ గనోరే అనుమతి ఇచ్చారు. ఈ విషయాన్ని టూరిజం యూనిట్ ఇన్‌చార్జ్ మేనేజర్ రాజేష్ తెలిపారు. 30 మంది పర్యాటకులతో ఏపీ టూరిజమ్‌కు చెందిన హరితా బోట్ పాపికొండల పర్యటకానికి గోదావరి నదిలో వెళ్లిందని ఆయన తెలిపారు.

బీఎన్ రోడ్డు పనులపై ధర్నాకు దిగుతా

- నాకు చెడ్డపేరు తేవాలనే నత్తనడకన పనులు
- టీడీపీ గుత్తేదారును బ్లాక్ లిస్టులో పెట్టాలి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, తనకు చెడ్డ పేరు తీసుకురావాలనే ఉద్దేశంతోనే భీమునిపట్నం – నర్సీపట్నం (బీఎన్) రోడ్డు పనులు పూర్తి చేయకుండా టీడీపీ కాంట్రాక్టరు చౌదరి కాలయాపన చేస్తున్నాడని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వడ్డాదిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తాకాశి రాజేష్ గృహంలో మంగళవారం ధర్మశ్రీ మాట్లాడారు. చోడవరం మండలం గంధవరం నుంచి నర్సీపట్నం వరకు బీఎన్ రోడ్డు అభివృద్ధికి రూ.120 కోట్లు మంజూరు చేయించానన్నారు. రోడ్డు పనులకు టెండర్లు పిలిచి రెండున్నరేళ్లు పూర్తయినా సంబంధిత కాంట్రాక్టర్ 15 శాతం సొంత నిధులు వినియోగించలేదన్నారు. రోడ్డు శిథిలంతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని వేగవంతంగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారునికి రూ.2 కోట్లు మెటీరియల్ అరువు ఇప్పించామని, రూ.50 లక్షల లేబర్ పేమెంట్లు పెండింగ్‌పై హామీ ఇచ్చినా రోడ్డు పనులు చేయకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రెండున్నరేళ్లుగా ఎండాకాలం, చలికాలం అంటూ తప్పించుకుని, ఇప్పుడు రోడ్డు పనులు ప్రారంభించి వర్షం కురుస్తుందని, ఆటంకంగా ఉందని కుంటుసాకులు చెప్పడంపై మండిపడ్డారు. టీడీపీ గుత్తేదారుతో తక్షణమే బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేయించాలని లేదా బ్లాక్ లిస్టులో పెట్టాలని, లేదంటే ధర్నాకు దిగుతానని అధికారులను హెచ్చరించారు.

రోడ్లకు అదనంగా రూ.8.8 కోట్ల మంజూరు..

భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డు పనులకు రూ.120 కోట్లతోపాటు అదనంగా మరో రూ.6.20 కోట్లు మంజూరు చేయించానని ధర్మశ్రీ తెలిపారు. చోడవరం, గవరవరం రోడ్డుకు రూ.2 కోట్లు, గవరవరం నుంచి లక్కవరం మీదుగా సింహాద్రిపురం రోడ్డుకు రూ.60 లక్షలు మంజూరు చేయించానన్నారు. అరిపాక నుంచి వెంకన్నపాలెం జంక్షన్ వరకు, చోడవరం పట్టణంలో నాల్గు లైన్లు, వడ్డాది జంక్షన్ నుంచి కాలేజీ వరకు, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, రావికమతం పెట్రోల్ బంక్ నుంచి గ్రామ శివారు వరకు బీఎన్ రోడ్డు విస్తరణ పనులకు అదనంగా నిధులు మంజూరు చేయించానని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరదేవి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, కోఆపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద, డైరెక్టర్ గొల్లవిల్లి సత్యనారాయణ, సర్పంచ్ గోపిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



కేకును కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మునగపాక పార్టీ కార్యాలయంలో యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక మండలం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చేలా పాటుపడాలన్నారు. నేతల మధ్య ఉన్న మనస్పర్థలను విడనాడి పార్టీ విజయం కోసం శ్రమించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు బోజా లక్ష్మి శ్రీనివాసరావు, చిందాడ దేవి, సచివాలయాల కన్వీనర్ పాలిమేర గణేష్, మండల అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



వెంకన్న సేవలో సినీ హీరో గోపీచంద్

రంపచోడవరం: ఇక్కడికి సమీపంలో టీటీడీ నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సినిమా హీరో గోపీచంద్ సోమవారం రాత్రి సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు. రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో ఆయన నటిస్తున్న సినిమా షూటింగ్ పది రోజులుగా జరుగుతోంది.

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నాక్ ఏ-ప్లస్ గ్రేడ్

- తెలుగు రాష్ట్రాల్లో సాధించిన తొలి కళాశాల ఇదే..



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నాక్ ఏ–ప్లస్ గ్రేడ్ వచ్చింది. ఈ మేరకు బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ఏపీ, తెలంగాణలోని మరేతర ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు అందని విజయం తాము సాధించామన్నారు. 2023–2028 వరకు కళాశాలకు గ్రేడ్ గుర్తింపు వచ్చిందన్నారు.

నెలాఖరుకల్లా నాడు–నేడు పనులు పూర్తి చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ



మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

చోడవరం రూరల్ : మన బడి నాడు–నేడు పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల విద్యాధికారులు, నాడు–నేడు పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇంజినీర్లు, సీఆర్పీలు, ఎమ్మెస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక పంపిణీ పూర్తి చేయాలని, విద్యాకానుక శతశాతం అథెంటికేషన్‌ను పూర్తి చేయాలని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ కచ్చితంగా పాటించాలని, భోజన తయారీ, పిల్లలకు వడ్డనలోనూ పరిశుభ్రత పాటించాలని తెలిపారు. చైల్డ్ ఇన్ఫో వెంటనే పూర్తి చేయాలన్నారు. అసిస్టెంట్ స్టేటస్టికల్ ఆఫీసర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ బైజూస్ యాప్ వాడకం, ఇంటరేక్టివ్ ఫ్లాట్ పానెల్ గురించి సోదాహరణంగా వివరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణరావు, ఏపిఇడబ్ల్యుసి డివిజనల్ ఇంజినీర్ ప్రసాద్ సమక్షంలో పాఠశాలల వారీ పనుల ప్రగతిని సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో చోడవరం మండల విద్యాధికారులు జయలక్ష్మి, సింహాచలం పాల్గొన్నారు.

చిన్న కుటుంబాలతో ఆరోగ్య జీవనం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లి టౌన్: చిన్న కుటుంబాలతో ఆరోగ్యంగా జీవించవచ్చని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, డీసీహెచ్‌ఎస్ పి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి నెహ్రూ చౌక్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో భారతదేశం చైనాను అధిగమించి అగ్రస్థానంలో చేరినట్టు ఇటీవల ఐక్యరాజ్య సమితి పాపులేషన్ ఫండ్ తాజా డేటా స్పష్టం చేసిందన్నారు. చిన్నకుటుంబాల ఆవశ్యకత, కుటుంబ నియంత్రణ పద్ధతులు గురించి వివరించారు. కాపర్ –టి వేయించుకున్న, గర్భనిరోధక ఇంజక్షన్స్ తీసుకున్న వారికి లక్కీడిప్ పద్ధతి ద్వారా ప్రోత్సాహక బహుమతులు త్వరలో కలెక్టర్ ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధిక కేంద్ర వైద్యాధికారి నీరజ, వైద్యులు శివరామకృష్ణ, కిశోర్, రోగుల బంధువులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఒడిశా వ్యక్తి అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తాతారావు, ఎస్‌ఐ రామకృష్ణ

కె. కోటపాడు : గంజాయి రవాణాకు సహకరిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రఫుల్ బడనాయక్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐ బి.తాతారావు, ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపారు. వారు ఎ.కోడూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఈ కేసు వివరాలను విలేకరులకు తెలిపారు. వివరాలివి. గత నెల 29వ తేదీన వారాడ గ్రామంలో కారులో తరలిస్తున్న 110 కిలోల గంజాయిని, ఇద్దరు నిందితులు దేవనంద్ పాండా, కన్నా సాహూలను అరెస్టు చేశారు. గంజాయిని తరలించేందుకు సహకరిస్తున్న వారి వివరాలను నిందితుల ద్వారా పోలీసులు రాబట్టారు. గంజాయి తరలింపునకు ఒడిశాకు చెందిన మధుముదలి, ప్రఫుల్‌బడనాయక్ సహకరించినట్టు దర్యాప్తులో తేలిందని, మధుముదలిని గత నెల 30న అరెస్టు చేయగా, ప్రఫుల్‌బడనాయక్‌ను మంగళవారం అరెస్టు చేశామని సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి వ్యక్తికి గాయాలు



లారీని ఢీ కొట్టి గాయపడ్డ వ్యక్తి

పాయకరావుపేట: స్థానిక జాతీయ రహదారిపై ఓ వ్యక్తి బైక్‌పై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడినట్టు ఏఎస్‌ఐ గోవిందు తెలిపారు. తునికి చెందిన అంటివేలు కుమార్ తుని నుంచి బైకుపై నక్కపల్లి వైపు వెళ్తుండగా వై జంక్షన్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన ఆగివున్న లారీని వెనుక భాగం బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కుమార్ తలకు బలమైన గాయమైంది. అతనిని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించినట్టు ఏఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పవర్ పోయినా డోంట్ కేర్!

- ఎలక్ట్రిక్ పరికరం రూపొందించిన డైట్ విద్యార్థినులు



డైట్ కళాశాల విద్యార్థినులు తయారీ చేసిన పరికరం

తుమ్మపాల: మీ ఇంట్లో కరెంట్ పోయిందా.. ఇన్వెర్టర్ లేదా.. అయినా పర్వాలేదు. కరెంటు పోయిన వెంటనే ఆటోమేటిక్ గానే బల్బు వెలిగేలా డైట్ కళాశాల విద్యార్థినులు సరికొత్త పరికరాన్ని తయారు చేశారు. పట్టణంలో దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన డిప్లొమా ఈఈఈ చదువుతున్న విద్యార్థినులు యారబాల నిహారిక, బండారు భూమిక, వి.రత్నకుమారి ఈ ప్రయోగం చేశారు. కరెంటు పోయిన వెంటనే బల్బుకు పవర్ సప్లై అయి, ఆన్ అయ్యేలా పరికరానికి బ్యాటరీ అమర్చారు. ఈ బ్యాటరీ ద్వారా కరెంటు ఉన్నప్పుడు చార్జింగ్ తీసుకుని కరెంట్ పోయిన వెంటనే అలెర్ట్ సౌండ్ చేస్తూ బల్బు వెలుగుతుంది. దీన్ని తయారు చేయడానికి రూ.600 ఖర్చు చేసినట్లు ప్రాజెక్టు ఇంజినీర్ బి.శేషగిరిరావు తెలిపారు. గైడ్‌గా జె.శివ వ్యవహరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ గోపాలమ్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ కె.పార్వతి విద్యార్థినులను అభినందించారు.

అప్పన్నను దర్శించుకున్న పార్లమెంటరీ కమిటీ



అప్పన్న ఆలయంలో పార్లమెంటరీ కమిటీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం అధికార భాషా సంఘం పార్లమెంటరీ కమిటీ దర్శించుకుంది. కమిటీ సభ్యులు శ్రీరామ్ చంద్ర జంగ్రా, ఐరన్న కడకి, సుజీత్‌కుమార్ స్వామిని దర్శించున్న వారిలో ఉన్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదం, స్వామివారి జ్ఞాపికను ఏఈవో భ్రమరాంబ అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఆలయ శిల్పసంపద ఎంతో బాగుందని, పూజా విధానం ఆకట్టుకుందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు నేషనల్ హైవే అథారిటీ, హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బీఈఎంఎల్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, రాష్ట్రీయ ప్రద్యోగికి సంస్థాన్, భారతీయ ప్రబంధన్ సంస్థాన్ అధికారులు, ప్రతినిధులతో ఆయా సంస్థలలో అధికార భాషా అమలు తీరుపై సమీక్షించారు.

కేకే లైన్‌లో రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ



పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌సత్పతి

అనంతగిరి: కొత్తవలస–కిరండూల్ మార్గంలో రైళ్ల రాకపోకలను మంగళవారం మధ్యాహ్నం నుంచి పునరుద్ధరించారు. ఈ మార్గంలో బొర్రా, కరకవలస మధ్యలోని రైల్వేపట్టాలపై సోమవారం సాయంత్రం బండరాళ్లు జారిపడటంతో పట్టాలతో పాటుగా ఓహెచ్‌సీ విద్యుత్ స్తంభం దెబ్బతింది. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం రాత్రి నుంచే యుద్ధప్రాతిపదికన రైల్వే సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైయ్యారు. సంఘటన స్థలానికి డీఆర్‌ఎం అనూప్‌సత్పతి చేరుకుని, పనులను పర్యవేక్షించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రతికూల వాతవరణంలో సైతం ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టి 12 గంటలకే పూర్తిచేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి కేకేలైన్‌లోని యథావిధిగా రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. యుద్ధప్రతిపాదికన పునరుద్ధరణ పనులు చేపట్టిన కార్మికులు, సిబ్బందిని రైల్వే డీఆర్‌ఎం అనూప్ సత్పతి అభినందించారు. ఆయన వెంట ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌సాహూ, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి, చీఫ్ ఇంజినీర్ కేడీరావు పాల్గొన్నారు.

ఏయూ ఇంజనీరింగ్ విద్యార్థులకు సువర్ణావకాశం

- నేవల్ డాక్‌యార్డ్‌లో 6 నెలల పాటు ఇంటర్న్‌షిప్
- ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన నేవీ, ఏయూ అధికారులు



వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

దొండపర్తి(విశాఖ): ఆంధ్రా యూనివర్సిటీ, దాని గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు సువర్ణావకాశం లభించనుంది. నేవల్ డాక్‌యార్డ్‌లో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కలగనుంది. ఇందుకు సంబంధించి ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్, రియర్ అడ్మిరల్ సంజయ్‌సాధు, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌లు మంగళవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీని ప్రకారం ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెరైన్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రక్షణ రంగంతో ఒప్పందం చేసుకోవడం చారిత్రాత్మక విషయమన్నారు. విద్యార్థులు డిఫెన్స్‌లో అధునాతన సాంకేతికతపై 24 వారాల పాటు అధ్యయనం చేసే అవకాశం లభించడం మంచి అవకాశమని పేర్కొన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశ ప్రయోజనాల కోసం భారత సాయుధ దళాలతో ఇప్పటి వరకు 30 ఎంవోయూలపై సంతకాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నేవీ నుంచి హెచ్‌ఆర్ జీఎం కమడోర్ అనూప్ మీనన్, హెచ్‌ఆర్ అడిషినల్ జనరల్ మేనేజర్ కమడోర్ ఆర్.వెంకటేశ్వరన్, డిప్యూటీ జీఎం(క్యూఏ) కెప్టెన్ సుబ్రతో మండల్, ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అడ్జంక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్ పాల్గొన్నారు.

14న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఎనాలిస్ ల్యాబ్, వసంత్ కెమికల్, ఎక్సెల్ ఇండస్ట్రీస్ టీం లీజ్ యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్, హై–గ్రో కెమికల్స్, ఫార్మాటెక్స్, వరుణ్ మోటర్స్, నైవేద్య రెస్టారెంట్, ది పార్క్ హోటల్ యాక్సిస్ బ్యాంక్ తదితర కంపెనీల్లో 215 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ రిప్రెసెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజనీర్, వెర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజనీర్ కేడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18–37 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ.10,000 నుంచి రూ.27,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ముగిసిన జిమెక్స్ విన్యాసాలు



విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధ నౌకలు

దొండపర్తి: జపాన్ ఇండియా మారీటైం విన్యాసాలు(జిమెక్స్) మంగళవారంతో ముగిశాయి. బంగాళాఖాతంలో ఇరుదేశాల నేవీ అధికారులు ఒకరికొకరు వీడ్కోలు పలకడంతో 7వ ఎడిషన్ వ్యాయామాలు పూర్తయ్యాయి. రియల్ అడ్మిరల్ గుర్‌చరణ్ సింగ్ నేతృత్వంలోని భారత నౌకాదళ నౌకలు కమోర్టా, శక్తి, అలాగే జపాన్ నావికాదళం నుంచి కమాండర్ ఎస్కార్ట్ ఫ్లొటిల్లా నిషియామా తకహీరో నేతృత్వంలో జపాన్ మారీటైమ్ సెల్ఫ్‌డిఫెన్స్ ఫోర్స్ నౌక జేఎస్ సమిదారే నౌకలు ఆరు రోజుల విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మూడు దశలలో ఉపరితలం, ఉప ఉపరితలం, గాలిలో ఇరుపక్షాలు తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాయి.

క్లుప్తంగా

రేబాక, పిసినికాడల్లో 'జగనన్న సురక్ష' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలో రేబాక, పిసినికాడ గ్రామాల్లో బుధవారం ఉదయం 10గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ గొర్లి సూరిబాబు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, దరఖాస్తుదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఆరోగ్యవంతులైన ప్రజలతోనే అభివృద్ధి



ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండటానికి ప్రయత్నించాలని, అందరికీ వైద్య సదుపాయాలు అందేలా సిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారి కోరారు. ఆరోగ్యకరమైన ప్రజలతో దేశం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, పీహెచ్ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

8 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రోటరీ అధ్యక్షుడు పీజే నాయుడు

అనకాపల్లిటౌన్: స్థానిక రోటరీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం 8 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు ఆస్పత్రి అధ్యక్షుడు పి.జె.నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం 35 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా, వారిలో శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన 8 మందికి ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు. వీరిని మూడు రోజుల పాటు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచనున్నట్లు తెలిపారు. నెల రోజులకు సరిపడా మందుల్ని ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు వైద్యసహాయకులు పి.దేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 191 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,350	4,350
మూడోరకం	3,650	3,950

అనకాపల్లి సినిమాలు

రుద్రంగి	: రాజా
ఆదిపురుష్	: సత్యనారాయణ స్క్రీన్-1
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)	: సత్యనారాయణ స్క్రీన్-2
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్తిసాయి
ఇన్సిడియస్ ద రెడ్ డోర్	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 366 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 285 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

వలంటీర్ల నిరసన జ్వాల

- ఊరూవాడా పవన్ వ్యాఖ్యలపై ఆగ్రహం
- వలంటీర్లకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలు

ప్రజాసేవలో నిమగ్నమవుతూ ప్రజలచే మన్ననలు పొందుతున్న తమపై బురదజల్లుతున్న చంద్రబాబు దత్తపుత్రుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై నియోజకవర్గ వ్యాప్తంగా వలంటీర్ల నిరసన జ్వాలలు మిన్నంటాయి. అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే తీసుకెళ్తున్న వలంటీర్లకు పలు రాష్ట్రాల సీఎంలు సైతం ప్రశంసిస్తున్నారు. ప్యాకేజీ రాజకీయాలకు అలవాటుపడ్డ పవన్ మాత్రం వలంటీర్ల వల్లే మానవ అక్రమ రవాణా సాగుతుందంటూ తీవ్ర ఆరోపణలు చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

అనకాపల్లిటౌన్ : ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఊరూవాడా వలంటీర్లు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వీరి ద్వారా ప్రభుత్వ సేవలందుకుంటున్న ప్రజలు సైతం పవన్ తీరును ఆక్షేపిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే మా ముంగిటకొచ్చి పింఛన్లు అందిస్తున్న వారు తమకెందుకు కీడు చేస్తారని ఎదురు ప్రశ్నిస్తున్నారు. కనీస ఆదరణకు నోచుకోని అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించే వలంటీర్లకు సర్వత్రా మద్దతు పెరుగుతోంది. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడిన పవన్ కల్యాణ్ తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాల్సిందే

కశింకోట: మండలంలోని తేగాడ సచివాలయం వద్ద మంగళవారం గ్రామ వలంటీర్లు నిరసన తెలిపారు. ప్లకార్డులు ధరించి పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలంటీర్లపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజలకు విశేష సేవలందిస్తున్న వలంటీర్లను కించపరుస్తూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. క్షమాపణ చెప్పకుంటే తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



కశింకోటలో ప్లకార్డులతో గ్రామ వలంటీర్ల నిరసన

మద్దతుగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్ మాట్లాడుతూ పవన్ తీరును తప్పుబట్టారు.

ఎక్కడున్నా.. పింఛన్ అందించి..

కశింకోట: మండలంలోని ఈ.చౌడువాడ గ్రామానికి చెందిన 11వ క్లస్టర్ వలంటీర్ పైల దేవి విశేష సేవలందిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. తన క్లస్టర్‌కు చెందిన కాండ్ర అప్పారావు ఈ ఏడాది మార్చిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు.

అతనికి వచ్చిన వృద్ధాప్య పింఛన్ సొమ్మును అదే నెల 3న తన సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి అందించి తన నిబద్ధతను చాటుకున్నారు. అధికారుల నుంచి అభినందనలు పొందారు. తన పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. స్థానికంగానే కాకుండా ఎక్కడో దూరంలో ఉన్న లబ్ధిదారులకు సైతం తమ సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తూ సేవా తత్పరతను చాటుకుంటున్న వలంటీర్లను జనసేన అధినేత పవన్ కల్యాణ్ కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం శోచనీయమని లబ్ధిదారులు చెప్తున్నారు..



విశాఖ కేజీహెచ్‌లో క్షతగాత్రుడైన లబ్ధిదారుడికి మార్చి నెల పింఛన్ సొమ్ము అందిస్తున్న పైల దేవి

సంక్షేమ సేవలో 'వజ్రం'



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టినప్పటి నుంచి నిబద్ధతతో పనిచేస్తున్నాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందించేందుకు నావంతు సేవలందిస్తున్నా. ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి ప్రభుత్వ సేవలను చేరువ చేశా. తద్వారా ప్రజలు, అధికారుల నుంచి మన్ననలు పొందా. ఈ ఏడాది ప్రభుత్వం నా సేవల్ని గుర్తించి 'సేవా వజ్ర'పురస్కారంతో గౌరవించింది. దీన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా అందుకోవడం మర్చిపోలేను. నాలా వలంటీర్లందరూ నిబద్ధతతోనే పేదలకు, ప్రభుత్వ సేవలు అవసరమైన వారికి సాయపడుతున్నారు. అలాంటి మా మనోభావాలు దెబ్బతినే విధంగా పవన్‌కల్యాణ్ లాంటి వారు వ్యాఖ్యానించడం శోచనీయం. ఇప్పటికైనా ఆయన తన తప్పు తెలుసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలి.

– మురమళ్ల లలితకుమారి, వలంటీర్, ఈ.చౌడువాడ, కశింకోట

బాధ్యత అనుకుని చేస్తున్నాం



తాము ఈ రోజు ఖాళీగా తిరక్కుండా ప్రభుత్వం ఒక బాధ్యతను అప్పగించింది. తమలాంటి వయస్సు వారు జులాయిగా తిరుగుతూ ఇంట్లో తల్లిదండ్రుల సంపాదనపై ఆధారపడకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సేవ చేసే బాధ్యత అప్పగించారు. మాపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే.

– దొంకా మోహన్, ఆమంచివారివీధి, అనకాపల్లి

పశుగ్రాసం సాగుపై అవగాహన

కశింకోట: నాణ్యమైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి పొందవచ్చని కశింకోట పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా కశింకోటలో పాడి రైతులకు మంగళవారం పశు గ్రాసం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు మేలైన పోషణ అందించేందుకు జొన్న, మొక్కజొన్న, అలసందలు, హైబ్రిడ్ నేపియర్, పిల్లిపెసర వంటి వాటిని పశుగ్రాసంగా సాగు చేయాలని సూచించారు. పొలంలోనే కాకుండా పొలం గట్లపై కూడా వీటిని పెంచవచ్చన్నారు. భూమి సారం, నీటి వసతుల ఆధారంగా పశుగ్రాస రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వర్షపాతం, నీటిపారుదల సదుపాయం ఎక్కువగా ఉంటే హైబ్రిడ్ నేపియర్, మొక్కజొన్నలను పెంచుకోవాలని, నీటి వసతి లేకుంటే జొన్నలు, సజ్జలు పెంచుకోవడం ఉత్తమమన్నారు. పశుగ్రాస పంటలను 50 శాతం పూత దశలో కోసి పశుగ్రాసంగా వేస్తే నాణ్యమైన, అధిక పాల దిగుబడి పొందవచ్చన్నారు. పశువుల మేతలో మూడు వంతులు గడ్డిజాతి పశుగ్రాసంతోపాటు ఒక వంతు పుష్పజాతి పశుగ్రాసాన్ని కలిపి మేపడం వల్ల పశువులకు అధిక పోషక విలువలు సమకూరతాయన్నారు. పశు గ్రాసాన్ని కోసిన తర్వాత కత్తిరింపు యంత్రంతో చిన్న ముక్కలుగా చేయడం వల్ల పశువులు ఆసక్తిగా తినడంతోపాటు, తీసుకునే ఆహార పరిమాణం కూడా పెరుగుతుందన్నారు. జొన్న పశుగ్రాసాన్ని పూతదశ తర్వాత మాత్రమే వినియోగించాలన్నారు. లేదంటే పశువులకు నాము వ్యాధిసోకే అవకాశముందన్నారు. బాజ్రా నేపియర్ హైబ్రిడ్‌లను మొదటి కోత 70 రోజులకు, తర్వాత కోత 45 రోజుల వ్యవధిలో కోసుకోవాలన్నారు. వేసవిలో సజ్జ పశుగ్రాసం సాగుకు అనుకూలమన్నారు. తక్కువ తడులతో త్వరగా ఎదిగి మూడు కోతల్లో ఎకరాకు 30 టన్నుల గడ్డి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



పశుగ్రాసం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు



రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లిటౌన్: పెరుగుబజార్–గాంధీబొమ్మ జంక్షన్ రహదారి విస్తరణ పనులు రెండో రోజైన మంగళవారం ప్రశాంతమైన వాతావరణంలో జీవీఎంసీ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ టీపీవో ఎంపీ జనార్దన్ మాట్లాడుతూ తొలి రోజు 10 భవనాలను, రెండో రోజు 15 భవనాలను తొలగించినట్లు తెలిపారు. భవన యజమానులు దగ్గరుండి మరీ తమ భవనాల తొలగింపు పనుల్ని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈ రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు రహదారి విస్తరణ పనులకు సహకరించాల్సిందిగా కోరారు.

ఓటరు జాబితాపై బూత్ స్థాయి పరిశీలన

అనకాపల్లిటౌన్: బూత్ లెవెల్ ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా ఈ నెల 21 నుంచి ఇంటింటా పరిశీలన చేయనున్నట్టు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్, ఆప్, బీఎస్పీ పార్టీ నేతలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవెల్ సిబ్బంది ప్రతీ ఇంటిని పరిశీలించి కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన ఓట్ల తొలగింపు, ఇంటి నంబర్లు, పేర్లలో సవరణలు, చిరునామా మార్పులు వంటివి చేపడతారన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు గొర్లి సూరిబాబు, ఎస్.వి.వి.రామచంద్రరావు, కొణతాల హరనాథ్‌బాబు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

సబ్బవరం: దేశ ఆర్థిక అభివృద్ధిలో జనాభా ఎంతో కీలకమని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకున్నప్పుడే దేశం పురోగతి సాధిస్తుందన్నారు. దేశంలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు గోవిందరావు, రామకృష్ణ, ఇంద్రసేన, రవీంద్రపాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నికృష్ణ



హాజరైన రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు

అనకాపల్లిటౌన్: ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన, నమోదును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ అన్నారు. గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో మంగళవారం నియోజకవర్గస్థాయి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అందించాలన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలో ఓటర్ల మార్పులు, చేర్పులు వంటివి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలుంటే సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షంతో రైతుల ఆనందం

కశింకోట: కశింకోట ప్రాంతంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పగటిపూట వేసవిని తలపించే ఎండ వేడిమితో సతమతమైన ప్రజలు రాత్రి వర్షానికి సేదదీరారు. ఈ వర్షం ఖరీఫ్ వరి నారు మడులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

23న ప్రజా సింహగర్జన బహిరంగసభ



ప్రజా సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్రయాదవ్

అనకాపల్లిటౌన్: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం ఈ నెల 23న ప్రజా సింహగర్జన భారీ బహిరంగసభను విజయవాడలోని ప్రజా చైతన్య వేదికలో నిర్వహించనున్నట్లు ప్రజా సింహగర్జన పార్టీ వ్యవస్థాపకుడు రామచంద్రయాదవ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్లో మంగళవారం బహిరంగసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు జీవుల బాగు, అన్నదాతల భరోసా, ఆడపడుచుల భద్రత తదితర అంశాలపై ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేరోజు నూతన రాజకీయ పార్టీ ప్రకటన ఉంటుందన్నారు. కార్యక్రమంలో బహిరంగ సభ సభ్యులు గోకాడ రఘూన్, కె.మల్లిఖార్జున, పి.రమేష్, గురవయ్య, పల్లా అర్జున్, వాయిబోయిన శేఖర్‌యాదవ్, వెంకటరమణ, కాండ్రేగుల చందు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలందరికీ రక్ష

అనకాపల్లిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సుపరిపాలన అందించేందుకు సచివాలయ, వలంటీరీ వ్యవస్థను ఏర్పాటు చేశారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం దిబ్బవీధి సచివాలయంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షతో ప్రజలు ధ్రువపత్రాల కోసం ఎవరి చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి లేకుండా ప్రభుత్వం తరపున నేరుగా ఇంటి వద్దకే అధికారులు వచ్చి పత్రాలు అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ చేదోడు వాదోడుగా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రజలకు వైఎస్సార్ చేదోడు, వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, అమ్మఒడి వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన రత్నాకర్‌కు కార్పొరేటర్ లక్ష్మీసౌజన్య కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 245 మంది దరఖాస్తుదారులకు వివిధ రకాలైన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ వై.శ్రీరామమూర్తి, జెడ్సీ కె.వెంకటరమణ, జీవీఎంసీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర, ఇన్‌స్పెక్టర్ ఎం.శేఖర్, సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దాడి రత్నాకర్

ఘనంగా ఆర్టీసీ ఈయూ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లిటౌన్: కార్మికులు ఉమ్మడిగా పనిచేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ఒకతాటిపైకి వస్తే అద్భుతాలు సాధించవచ్చని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో సీనియర్ నాయకుడు బిక్కుబాబు, కార్యదర్శి బీవీఎస్ నారాయణ అన్నారు. స్థానిక గ్యారేజీ ఆవరణలో యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జెండాను ఆవిష్కరించి, యూనియన్ సభ్యులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రజా రవాణా వ్యవస్థగా ప్రభుత్వంలో విలీనం చేయడం శుభపరిణామమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎల్లప్పుడూ శక్తి వంచన లేకుండా పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్మికులు అందరూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని కోరారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డీఎస్ మూర్తి, కేకే కుమారి, కె.లక్ష్మి, కె.సత్యవతి, పి.రాజేశ్వరరావు, వైవీఎస్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాస్, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ దినోత్సవం సందర్భంగా కార్మికులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న బిక్కుబాబు, నారాయణ

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గృహాలు నిర్మించుకునే సమయంలో ఇంటి ముందు కనీసం ఒక మొక్క నాటి, దాని ఎదుగుదలకు కృషిచేయాలని డీఆర్వో పి.వెంకటరమణ సూచించారు. మండలంలోని వేటజంగాలపాలెం, సీతానగరం, కుంచంగి, కూండ్రం, వెంకుపాలెం గ్రామాల్లో స్టోన్ క్రషర్స్ యజమానులు, స్థానిక ప్రజల సహకారంతో మంగళవారం 5 వేల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ వివిధ రకాలైన వ్యాధులకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. మొక్కలను పెంచడం ద్వారా పరిశుభ్రమైన గాలిని పీల్చి ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు. రాగి, తెల్ల మద్ది, వేప, నేరేడు మొక్కలను నాటారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఏడీ సుబ్బారాయుడు, స్టోన్ క్రషర్స్ అధినేత మల్లిఖార్జున, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



మొక్కను నాటి మట్టివేస్తున్న డీఆర్వో వెంకటరమణ

కొండుపాలెంలో ఆరోగ్య సర్వే

అనకాపల్లి రూరల్: ప్రజల ఆరోగ్యం, వ్యాధులు, వైద్యానికి చేస్తున్న ఖర్చులు, అందుబాటులో ఉన్న వైద్య సేవలు తదితర అంశాలకు సంబంధించి మండలంలోని కొండుపాలెంలో మంగళవారం 6వ విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. తుమ్మపాల పీహెచ్‌సీ సిబ్బంది, సిగ్మా రీసెర్చ్ సంస్థ ప్రతినిధులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ప్రశ్నావళి ఆధారంగా గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల గురించి, క్షేత్ర స్థాయిలో వాటి అమలు తీరు ఎలా ఉందో ఆరాతీశారు. ఇప్పటివరకు 5 విడతల సర్వే పూర్తికాగా 6వ విడత సర్వేను ప్రస్తుతం ప్రారంభించారు. నాలుగు నెలల్లో ఈ సర్వే పూర్తి చేయనున్నారు. సర్వేలో భాగంగా తుమ్మపాల పీహెచ్‌సీ సిబ్బంది గ్రామస్తులకు బీపీ, సుగర్, ఎత్తు, బరువు పరీక్షించారు. కార్యక్రమంలో సిగ్మా పరిశోధనా సంస్థకు చెందిన ఏడుగురు సభ్యుల బృందం, టీం లీడర్ ఆర్ తారకాచారి, తుమ్మపాల పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఎంఎల్ హెచ్‌పీ ఎం శాంతి, ఎంపీహెచ్ఏలు కె సుమిత్ర, ఎస్ రాము, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండుపాలెంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చేపడుతున్న సిబ్బంది

జగనన్న సురక్షను వినియోగించుకోండి



సమావేశానికి హాజరైన సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు



అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వలంటీర్లు గృహాలను సందర్శిస్తున్న సమయంలో తమకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్ల కోసం జగనన్న సురక్ష యాప్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి, సీహెచ్ఎన్ అగ్రహారం, కూండ్రం గ్రామాల్లో జగనన్న సురక్షపై మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం 95 శాతం అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి, మరింత సంక్షేమం, అభివృద్ధికి సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నేతలు సేనాపతి పెంటారావు, యలమంచిలి చినరమణ, మొల్లి గంగునాయుడు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పెదపాడు, జగ్గన్నపేట ఆర్బీకేలో మంగళవారం ఖరీఫ్ వరి విత్తనాల్ని ఎంపీపీ భర్త కోన బుజ్జి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బీ.శంకర్ గోవింద్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు నాటేటప్పుడు విత్తన శుద్ధి చేయాలని సూచించారు.



వరి విత్తనాలు అందజేస్తున్న కోన బుజ్జి